క్లుప్తంగా

ఎంపీడీఓకు ఘన సన్మానం

కొందుర్గు: జిల్లా ఉత్తమ ఎంపీడీఓ అవార్డు గ్రహీత కొందుర్గు ఎంపీడీఓ ఆంజనేయులును బుధవారం ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆంజనేయులు సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు అందజేయడం అభినందనీయమన్నారు. ఆయన మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు సోని, బాల్‌రాజ్, కొండయ్య పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత



విద్యార్థిని తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట: తమ దగ్గర చదివిన విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఆర్థిక సహాయం చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి, ప్రస్తుతం బిటెక్ చదువుతున్న విద్యార్థిని నవ్యకు 20వేల ఆర్థిక సహాయం ఉపాధ్యాయులు అందజేశారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థి చదువును నిరాటంకంగా కొనసాగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రసూల్, ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, జహంగీర్, విజయనిర్మల, సునీత, దేవలక్ష్మిలు అండగా నిలబడ్డారు.

ఘనంగా శివ పడిపూజ



శివ పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు, స్వాములు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు గ్రామంలో బుధవారం శివపడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శివమాలధరించిన స్వాములు అంతా కలిసి సన్నిదానంలో శివ మహాపడి పూజ ఏర్పాటు చేశారు.ఈ పూజలు గురుస్వామి సురేశ్ పంతులు ఆధ్వర్యంలో జరిపించారు. గ్రామంలోని ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ శివపూజలో పాల్గొనడంతో గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. శివుని భక్తి గీతాలతో అలరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

కేశంపేట: స్నేహితుడు మృతి చెందడంతో అతడి జ్ఞాపకార్థం తోటి మిత్రులు పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో ఇమ్మిడి సతీష్‌కుమార్ రెండవ వర్ధంతి సందర్భంగా యువసేన యూత్ సభ్యులు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నోటు పుస్తకాలను, పండ్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు యువసేన యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని రామేశ్వరం ముఖద్వార నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సంపత్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, నాయకులు భీష్వ రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, అరుణ, భార్గవ్‌కుమార్, శ్రీశైలం, లక్ష్మణ్ నాయక్, బాలునాయక్, హన్యానాయక్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు

బీఆర్‌ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మీనర్సింహారెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని మహాలింగపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన మలిదశ ఉద్యమంలో కేసీఆర్ పాత్రపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ .. రాష్ట్ర సాధనలో సీ ఎం కేసీఆర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి తెలియాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాదగిరి, ఉపాధ్యాయులు రెహానా, ప్రభాకర్, శ్రీనివాస్, రాజేందర్, నందు, పెంటయ్య పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలోని సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజన గురువైన సంత్‌సేవాలాల్ నిరుపేద కుటుంబంలో జన్మించారని అన్నారు. చిన్నతనం నుంచి సేవాలాల్‌కు దైవభక్తి అధికంగా ఉండేదని. పెద్దల పట్ల ఎంతో గౌరవంగా మెలిగేవాడని చెప్పారు. సమాజంలో నెలకొన్న సమస్యలపై అవగాహన పెంపొందించుకొని గిరిజనుల అభివృద్ధికి సేవాలాల్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమాల్లో మిట్టునాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, మంగులాల్‌నాయక్, భీష్వరామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుల్జా భవానీ భోగ్ బండారు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, అశోక్, రుషికేష్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: సేవాలాల్ 284వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రూప్లానాయక్, రాజునాయక్, జగన్‌నాయక్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్ పాల్గొన్నారు.

గిరిజనుల ఆశాజ్యోతి సంత్ సేవాలాల్

షాబాద్: గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన ఆధ్యాత్మిక గురువు సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రవినాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌నాయక్ అన్నారు. బుధవారం మద్దూరు హనుమానాయక్ తండా, మాచన్‌పల్లి దూసరికుంట తండా, ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీసేవాలాల్ 284వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్‌శ్రీసేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... క్రీ.శ 1739లోనే గిరిజనుల సమస్యలపై నిజాం నవాబుతో పోరాడిన యోధుడన్నారు. లంబాడా తెగలకు చెందిన ప్రజలు పదవుల కోసం హైదరాబాద్ నవాబుతో సంత్ సేవాలాల్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి గెలిచినట్లు చరిత్రలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల గిరిజన నాయకులు తదితరులున్నారు.

చేవెళ్లలో...

చేవెళ్ల: మండలకేంద్రంలో గిరిజన ప్రజలు సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సుకోసం చూపించిన మార్గం అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. గిరిజనులు అభివృద్ధికి బాటలు వేసినట్లు తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా చేవెళ్ల మండలంలో ఉన్న గిరిజనులంతా కలిసి మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్‌ఐ చందర్‌నాయక్ పాల్గొన్నారు. ఆయన సేవాలాల్ మహారాజ్ సేవలను కొనియాడారు. అలాంటి మహనీయులను మరిచిపోవద్దని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు



రక్తదాన శిబిరంలో ప్రిన్సిపాల్, తదితరులు

మొయినాబాద్ రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ముఖ్యంగా యువత రక్తదానంలో పాలుపంచుకోవాలని చిలుకూరు బాలాజీ ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరరావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల చిలుకూరు బాలాజీ ఫార్మసి కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నగరంలోని మమత ఆస్పత్రి వారు నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పాల్గొనాలని సూచించారు. ముఖ్యంగా దేశంలో ఎంతో మంది ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలై సరైన సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అలాంటి వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. యువత రక్తదాన శిబిరాలు ఎక్కడ నిర్వహించిన రక్తదానం చేయాలన్నారు. సంవత్సరానికి రెండు సార్లు రక్తదానం చేస్తే మానవుడిలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. మమత ఆస్పత్రి వారు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మమత ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మురళీధర్‌గుప్తా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను వినియోగించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

కొందుర్గు: పలు గ్రామాల్లో డంపింగ్ యార్డులు వినియోగించడం లేదని ఇకనుంచి అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అలాగే, నర్సరీలో పోగుంతలలో తిరిగి మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో ఇదివరకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను గుర్తించాలని, వాటికి సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ లాలయ్య, ఏపీఓ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఖాజాఇద్రీస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. పల్లెలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అభివృద్ధి పనుల విషయంలో పంతాలకు పోకుండా అందరు సహకరిస్తే ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఎంపీఓ కల్యాణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

సీపీఐ నాయకుడు జంగయ్య



గుడిసెల వద్ద మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

చేవెళ్ల: దేశానికి స్వాంతత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తరువాత కూడా దేశంలో ప్రజలు కూడు, గూడుకోసం ఎదురు చూసే పరిస్థితి ఉండడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండలకేంద్రంలో బుధవారం భూపోరాటంలో భాగంగా చేవెళ్లలోని సర్వే నం.75లో పేదలకు గుడిసెలు వేసిన చోట రెండవ రోజు సమావేశం నిర్వహించి బొమ్మనగారి ధర్మభిక్షం 101వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ... పేదలకోసం పోరాటం చేస్తున్న సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్ట్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఇంకా ఎంతో మంది పేద ప్రజలు కూడు, గూడు లేక ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పేదలకోసం అన్ని చేస్తున్నామని చెబుతున్నాయే కానీ ఎక్కడ కూడా ఆచరణలో జరగడం లేదన్నారు. పేదలకు అన్ని వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం పోలీసులచే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. నిరూపేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అప్పటి వరకు ఈ గుడిసెలు వేసుకున్న పేదలు ఎక్కడి వెళ్లరని పోలీసులు, అధికారులు ఎవరు వచ్చిన భయపడేది లేదని వారికి అండగా సీపీఐ పార్టీ నిలబడుతుందని చెప్పారు. గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కె. రామస్వామి, ఏఐకేఎస్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు అంజయ్య, సత్తిరెడ్డి, ఎండీ మక్బుల్, శ్రీనివాస్, జంగయ్య, రఘురాం, మల్లేశ్, సాయిలమ్మ, విజయమ్మ ఉన్నారు.

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ఏమైంది!

బీజేపీ నేత మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మిథున్ రెడ్డి

కొందుర్గు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం ఏమయ్యిందని బీజేపీ నేత మిథున్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ తలపెట్టిన ప్రజాగోస.. భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడని, ప్రస్తుతం కేసీఆర్ మోసాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కేసీఆర్ రైతుల భూములను దేవాలయ భూములను లాక్కోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర రెడ్డి, కురుమయ్య, నర్సింలు, రాములు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

సర్పంచ్ జయమ్మ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ జయమ్మ

షాబాద్: ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ముద్దెంగూడ సర్పంచ్ కుర్వ జయమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులతో కలిసి గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని పలు కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ, ఎంపీపీల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శోభ, వార్డు సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థులను కఠినంగా శిక్షించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి-హైదరాబాద్ ప్రధాన రోడ్డులో కారు, బైక్ రేజింగ్‌లకు పాల్పడుతున్న ఇక్ఫాయి కళాశాల విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి. శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాల విద్యార్థులు మంగళవారం శంకర్‌పల్లి-హైదరాబాద్ రోడ్డుపై కారు రేసింగ్‌లతో జనవాడ గ్రామానికి చెందిన చాకలి శాంతమ్మ అనే మహిళ ప్రాణాన్ని బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఈ రోడ్డులో నిత్యం కారు, బైక్ రేజింగ్‌లు చేస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని విద్యార్థులు, కళాశాల యాజమాన్యంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కళాశాల పరిసరాలల్లో విద్యార్థులు మద్యం, ధూమపానం సేవిస్తూ రోడ్లపై ఎన్నో ప్రమాదాలకు కారణం అవుతున్నారని ఆరోపించారు. కళాశాల పరిసరాలల్లోని హోటళ్లల్లో మద్యం ఏరులై పారుతున్న సంబంధిత అధికారులు, కళాశాల యాజమాన్యం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, కమిటీ సభ్యులు శ్రీకాంత్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న మేట్‌లు

షాద్‌నగర్: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న తమకు గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీనియర్ మేట్లు బుధవారం ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ మేట్లు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా తాము ఎలాంటి వేతనాలు లేకుండా పని చేస్తున్నామన్నారు. 12వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఈజీఎస్ పథకంలో తాము చేయించిన పనికి సంబంధించి ఎలాంటి రికవరీలు రాకుండా నిబద్ధతతో పని చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా గ్రామ కార్యదర్శులు చెప్పిన విధంగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములమవుతున్నామన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటించడం, కమ్యూనిటీ ప్లాంటేషన్, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర పనులను అన్ని స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో పనులు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పవన్‌కుమార్, మల్లేష్, వెంకటయ్య, శ్రీశైలం, రాజు, శంకర్, మల్లేష్, జగన్, రాములు, భాస్కర్ ఉన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం దివాలా

• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్

శంకర్‌పల్లి: సీంఎ కేసీఆర్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలో మున్సిపల్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు బీర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని..ఆయన కుటుంబ సభ్యులే రాజాబోగాలు అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమస్యలు విలయతాండవం చేస్తుంటే సీఎం కేసీఆర్ ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధిలో వెనుకపడిందని ఆరోపించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్తులను అమ్ముకొని డబ్బుబలు కూడబెడుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోని రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లో ఇల్లు లేని నిరుపేదలకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జి కంజర్ల ప్రకాష్, సెన్సార్ బోర్డు మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి,నాయకులు రాజ్‌కుమార్, లోకేష్, జైరాంరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

మాణిక్‌రెడ్డి గెలుపుతోనే సమస్యల పరిష్కారం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్



ప్రచారంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ గెలిపించుంకుందామని జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి బుగ్గరాములు, మజీద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాపన్నగారి మాణిక్ రెడ్డిని గెలిపించుకుంటే ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తారని తెలిపారు. ఆయనకు మద్దతుగా మనందరం కృషి చేస్తూ ప్రచారంలో ముందుకు వెళ్లాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భీంరెడ్డి, కార్యదర్శి నర్సింహ, కన్వీనర్ ముజిబుల్లా, ఉపాధ్యక్షుడు సతీష్, మహిళా ఉపాధ్యక్షురాలు సులోచన, మహిళా కార్యదర్శి సువర్ణ, దౌల్తాసుల్తాన్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

కేశంపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, వేములనర్వ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి వెంకటప్ప బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు అందరూ మాణిక్‌రెడ్డిని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటయ్య, కృష్ణయ్య, బాలయ్య, చంద్రశేఖర్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు



షాబాద్ మండలం తాళ్లపల్లిలో పడిపూజ నిర్వహిస్తున్న శివస్వాములు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు దోస్వాడ నర్సింహులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లపల్లి హనుమాన్ దేవాలయంలో శివస్వామి మహాపడిపూజ నిర్వహించారు. గురుస్వామి రాజాలింగం ఆధ్వర్యంలో పడిపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కోలవాని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు కొంత సమయం దేవునికి కేటాయించాలని చెప్పారు. అనంతరం శివ స్వాములకు ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామస్తులు తదితరులున్నారు.